# ఎవరు రాక్షసులు

## వినాయకచవితి

ముఖ్యమైన పండుగలలో యిది ఒకటి.

కాని యిక్కడ చిన్న విచిత్రం వుంది. పండగ రోజు కన్నా ముందు రోజు ఎక్కువ హడావిడిగా, సందడిగా వుంటుంది.



అంటే ముందు రోజు మధ్యాహ్నం అయ్యేసరికి చుట్టుప్రక్కల చిన్న చిన్న గ్రామాల్లో వుండే ప్రజలు పట్టణాలకు వచ్చి, వినాయకచవితికి కావల్సిన సామగ్రి అంతా- వినాయకుడి బొమ్మలు, పాలవెల్లులు, పత్రి యింకా మొదలైనవి రోడ్డు పక్కనే వరసగా కూర్చుని, గోలగోలగా అరుస్తూ అమ్ముతుంటారు. ఆ దృశ్యం చూస్తూ వుంటే పట్టణానికి, గ్రామానికి తేడా తెలియదు.

చాలా బావుంటుంది ఆ దృశ్యం.

అలా చుట్టుపక్కల గ్రామాల్లో నుంచి వచ్చిన వాళ్ళల్లో వీరయ్య కుటుంబం ఒకటి.

విజయవాడ సత్యనారాయణ పురం స్టేషన్‌లో ప్యాసింజరు రైలు దిగి, బరువైన గోనె సంచి మూటని భుజాన వేసుకుని, పట్టాల ప్రక్కనుంచి నడుచుకుంటూ రోడ్డు మీదకు వచ్చారు వీరయ్య, అతని భార్య సీతమ్మ, వాళ్ళ అయిదేళ్ళ పాప. సరిగ్గా సత్యనారాయణపురం రైల్వే గేటు దగ్గరకు వచ్చి ఆగారు.

గేటుకి అటు వైపు సత్యనారాయణపురం, ఇటు గాంధీనగరం.

ఎటు వెళ్ళాలో అర్థం కాలేదు వీరయ్యకి.

అక్కడక్కడా నెరిసి, బొత్తిగా తైల సంస్కారం లేక చింపిరిగా వున్న జుట్టును బరబరా గోక్కుని "సీతాలూ ఎటు వెళ్దామే" అడిగాడు భార్యని.

సీతాలు కొంచెం ఆలోచించి "మనతో పాటు రైల్లో దిగినోళ్ళంతా అటుకేసి వెళ్ళారుగా మనం యిటు వెళ్దాం" అంది.

వీరయ్య వెంటనే మరో ఆలోచన చెయ్యకుండా, భార్య మాటపై గౌరవం వున్న వాడిలా గోనె సంచిని భుజాన వేసుకుని సీతాలు చెప్పిన వైపుకి అంటే గాంధీ నగరంలోకి అడుగుపెట్టాడు.

ఇరవై అడుగులు వేశాడో లేదో భుజం మీద బరువు మొయ్యలేని వాడిలా అక్కడే ఓ యింటి తాలుకు చిన్న అరుగు వుంటే దాని మీద పెట్టి, ఆయాసం తీర్చుకునేందుకు ఆగాడు.

సీతాలు కూడా ఆగిపోయి చుట్టూ చూసి "మావా ఇక్కడ బాగానే వుందిగా. మన పక్కన పోటీ కూడా ఎవరూ లేరు. ఇక్కడ కూర్చుని అమ్మామంటే మన అమ్మకం జోరుగా సాగుద్ది" అంది. వీరయ్యకి కూడా ఆ ఆలోచన నచ్చినట్టుంది వెంటనే "సరే" అన్నాడు.

వాళ్ళు అక్కడే సర్దుకుని కూర్చున్నారు. వీరయ్య పెద్ద మూటను విప్పాడు. అందులో బంక మట్టి వుంది.

ఇంతలో వీరయ్య కూతురు భుజానికి తగిలించుకున్న సంచిలోనుంచి ఏదో బయటకు తీసింది.

అది చిన్న సైజు వినాయకుడి ఆకారంలో వున్న అచ్చు. దానిలో బంక మట్టి పెట్టి నాపరాయి మీద గట్టిగా అదిమి బయటకు తీస్తే ఆ బంక మట్టి వినాయకుడి బొమ్మగా తయారవుతుంది.

"మావా నువ్వెళ్ళి ఒక బల్ల అద్దెకు తీసుకురా బొమ్మలు పెట్టాలిగా" అంది సీతాలు.

వీరయ్య పక్కనే వున్న షామియానా హౌస్ దగ్గరకు వెళ్ళి ఒక చెక్క బల్ల అద్దెకు తీసుకొచ్చాడు.

వాళ్ళ పని ప్రారంభమయ్యింది.

వీరయ్య అయిదేళ్ళ కూతురు మూటలో వున్న మట్టిని కొంచెం తీసి అందులో వున్న చిన్న చిన్న రాళ్ళను ఏరి శుభ్రం చేసి వీరయ్యకిచ్చింది.

వీరయ్య ఆ మట్టిని తీసుకుని వినాయకుడి అచ్చులో పెట్టి వినాయకుడి ఆకారం తయారుచేసి బల్ల మీద పెట్టాడు.

సీతాలు వాటిని రోడ్డు మీద పోయే వాళ్ళకు చూపించి "వినాయకుడి బొమ్మలండి. వినాయకుడి బొమ్మలండి" అని అరవడం ప్రారంభించింది.

"రేటు చెప్పవే" అని అరిచాడు వీరయ్య.

"బొమ్మ రూపాయి. బొమ్మ రూపాయి" అని మళ్ళీ అరవసాగింది.

సాయంత్రం ఆరు గంటల దాకా వారి పని చురుకుగా సాగింది. అంతవరకు వారు చేస్తున్న పనిని ఒక్కసారి కూడా ఆపలేదు. వారితో పాటు ఆ పాప కూడా అలాగే విరామం ఎరగకుండా చలాకీగా పని చెయ్యసాగింది.

వాళ్ళు కూర్చున్న ప్రదేశానికి ఎదురుగుండా అంటే రోడ్డుకి అటు వైపు మెడికల్ షాపు వుంది. షాపులో కూర్చున్న మురళి వీరినే ఆసక్తిగా చూస్తున్నాడు.

వాళ్ళు వచ్చిన దగ్గర్నుంచి గమనిస్తూనే వున్నాడు. ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోకుండా, అలసట తెలియని వారిలా కష్టపడుతున్న వారి పనితనాన్ని జాగ్రత్తగా గమనించసాగాడు.

మురళికి వాళ్ళని చూస్తూ వుంటే సరదాగా వుంది. అతనికి ఆ పాపని చూస్తే ముచ్చటేసింది.

అంత చిన్న వయసులో కూడా తల్లిదండ్రులకి సహాయపడుతోంది. చకాచకా ఎంతో నేర్పుతో మట్టిని బాగుచేస్తూ, మధ్యలో తండ్రితో ఏదో నవ్వుతూ చెబుతోంది.

వారు కూడా ఆ పాప మాటలకు నవ్వుతున్నారు. 'అన్యోన్యమైన కుటుంబం' అనుకున్నాడు మురళి.

సమయం ఏడు గంటలయ్యింది. బాగా చీకటి పడింది. ఆ వీధి మొత్తం అరుపులతో, అమ్మకాలతో కలగా పులగంగా, కేకల విందుగా తయారయింది.

ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై పోయింది. వాతావరణం చల్లగా తయారయింది. ముందు చినుకులు పడి క్రమంగా పెద్దదయ్యింది.

ఒక్కసారి వర్షం ఉధృతం అయ్యేసరికి అక్కడ అమ్మేవాళ్ళు త్వరత్వరగా సామాన్లు సర్దుకుని, ఎదురుగా వున్న షాపుల్లోకి, ఇళ్లల్లో బయట వున్న అరుగుల మీదకు వెళ్ళి నిలబడ్డారు.

వీరయ్యకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఆందోళనగా మట్టి వంక చూశాడు. మట్టి తడిసిపోతే చాలా కష్టం.

సీతాలు తయారు చేసిన బొమ్మలు పైన పెద్ద గుడ్డ



# కొమ్మూరి రవికిరణ్



కప్పి వర్షం వాటి మీద పడకుండా తంటాలుపడుతోంది.

ఎదురుగా షాపులో కూర్చుని వీళ్ళ అవస్థ గమనిస్తున్న మురళికి జాలేసింది. వెంటనే అతను లేచి షాపు బయటకి వచ్చి "ఇదిగో! ఏమయ్యా" అని పిలిచాడు.

వీరయ్య చూశాడు.

"వర్షం వస్తోంది. అన్నీ పాడయిపోతాయ్ యిటు తీసుకొచ్చేయ్" అని అరిచాడు.

ఆదరాబాదరాగా సామాన్లు సర్దుకున్నారు. బరువైన మూటలో వున్న మట్టిని మొయ్యలేక వీరయ్య కష్టపడుతుంటే మురళి వెళ్ళి సాయం పట్టి షాపు ముందున్న గట్టు మీద పెట్టాడు.

"దేవుడిలా వచ్చి సహాయం చేశారు బాబు. లేకపోతే మట్టంతా పాడయిపోయి రేపటికి పనికి వచ్చేది కాదు" అన్నాడు కృతజ్ఞత నిండిన కంఠంతో.

మురళి నవ్వి వూరుకున్నాడు.

సీతాలు అరుగు మూలగా ఒదిగి కూర్చుంది. ఆమె వడిలో పాప చలికి వణికిపోతూ కూర్చుంది.

వీరయ్య నిలబడి బీడీ కాల్చసాగాడు.

వర్షం బాగా పడుతోంది. ఖాళీగా వున్న మురళి ఏమీ తోచక అతనితో మాటలు కలిపాడు.

"ఏం పేరయ్యా నీది?" అనడిగాడు.

"వీరయ్య బాబు"

"ఏ వూరు నుంచి వచ్చారు?"

"కారంపూడి నుంచి బాబు" వినయంగా చెప్పాడు వీరయ్య.

"ప్రతి ఏడాది యిలాగే వస్తారా?"

"లేదు- యిదే మొదటిసారి" ఈ సారి వీరయ్య బెరుకుపోయి మామూలుగా మాట్లాడసాగాడు.

కాసేపాగి వీరయ్య అడిగాడు "మీరేం చేస్తారు బాబు?"

"ఇదిగో చూస్తున్నావుగా ఈ షాపు నాదే" అన్నాడు మురళి.

"మంచిది బాబు. ఇప్పటి రోజుల్లో వుద్యోగం కన్నా వ్యాపారమే రైటైన పని."

అతని మాటల్లో యాస ఎక్కడా కనపడకపోవడం చూసి విస్మయంగా అడిగాడు మురళి- "ఏం చదువుకున్నావ్ వీరయ్యా?"

"అయిదో తరగతి వరకు చదువుకున్నాను బాబు"

కాసేపాగి అడిగాడు మురళి "ప్రతి ఏడాదీ రాకుండా యీ సారి ఎందుకు వచ్చారు?"

దానికి వెంటనే సమాధానం చెప్పలేదు. మౌనంగా భార్య వంక చూడసాగాడు.

ఇది గమనించిన మురళికి ఏదో బలమైన కారణముందనిపించింది. అతనిలో ఉత్సుకత పెరిగింది.

మళ్ళీ రెట్టించాడు.

వీరయ్య ఏదో చెప్పబోయాడు కాని యింతలో సీతాలు "వద్దు మావా చెప్పొద్దు" అంది బాధగా ముఖం పెట్టి.

"చెప్పనివ్వవే. చెప్పుకుంటే కనీసం బాధైనా తీరుతుంది. ఇన్నాళ్ళు యీ బాబులా అడిగిన వాళ్ళు లేరు" అన్నాడు కొంచెం కోపంగా.

సీతాలు ముఖం-తిప్పుకుంది.

వీరయ్య చెప్పసాగాడు. 'మా వూళ్ళో రామరాజు అని భూస్వామి వున్నాడు బాబు. రామరాజు లేని వాళ్ళకు డబ్బు అప్పుగా యిచ్చి ఎక్కువ వడ్డీలు గుంజుతుంటాడు. వాడి దగ్గర నా చిన్నతనంలో ఏదో అవసరమయి మా అయ్య డబ్బు అప్పుగా తీసుకున్నాడు. కాని మా అయ్య పొలాలన్నీ అమ్మి కట్టినా వాడి బాకీ తీరలేదు. అంతలా పెరిగిపోయింది వడ్డీ. మా వూళ్ళో ఎవ్వరికీ వాడిని ఎదిరించే ధైర్యం లేదు. మా అయ్య చచ్చిపోయాడు. రామరాజు కూడా చచ్చిపోయాడు కాని వాడి కొడుకు కామరాజు తండ్రిని మించిన కొడుకు బాబు. మా అయ్య కట్టవలసిన బాకీ నా మీద పడింది. ఇన్నాళ్ళూ కట్టుకుంటూ వస్తూనే వున్నాను బాబు. దొరికిన అడ్డమైన పనీ చేశాను. బయటకు వచ్చి ఎక్కడయినా బ్రతుకుదామంటే వున్న అర ఎకరం పొలం ఆ వూళ్ళోనే వుంది. అది కూడా పోతే మాకు జీవనాధారం లేదు. ఎలాగో కష్టపడి కట్టుకు వస్తున్నాను బాబు. చివరకు బాకీ మాట ఇరవై రూపాయిలకు దిగింది. మాలాంటి పేదోళ్ళకు మాట యిరవై రూపాయిలు కట్టడానికి కనీసం ఏడాది పడుతుంది బాబు. అంతవరకు వాడు పెట్టే బాధలు భరిస్తూ వుండలేం బాబు. అందుకే వినాయకుడి బొమ్మలు అమ్మి ఆ వచ్చిన డబ్బు వాడి ముఖాన కొడదామని యిలా వచ్చాం బాబు" అని చెప్పడం ముగించాడు.

అతని గొంతులో అంతులేని వ్యథ. ఎంతో ఆవేశం.

మురళి వెంటనే మాట్లాడలేదు. అతనికి ఒక కొత్త సత్యం దొరికినట్లయింది.

పేదవాడు చదువులేని అమాయకుడు కాబట్టే విధిగా తండ్రి తీర్చవలసిన బాకీ నెత్తిమీద వేసుకున్నాడు. అందుకే ఆ కామరాజు ఆటలు అలా సాగుతున్నాయి. ఇలాగే వుంటే యీ బాకీలు కడుతుండడంతోటే యితని జీవితం కాస్తా అంతమైపోయింది. మురళి సీతాలు వంక చూశాడు. వీరయ్య ఎంత తేలికగా చెప్పినా అప్పు తీర్చమని ఆ కామరాజు ఎంత హింసపెడుతున్నాడో ఆమె కన్నీళ్ళను చూస్తుంటే అర్థమవుతోంది.

మురళి ముగ్గురి వైపు జాలిగా చూశాడు. వర్షం తగ్గినట్లయింది.

మురళి కొట్టు కట్టేస్తూ వుండగా వచ్చాడు వీరయ్య. ఏమిటన్నట్టు చూశాడు మురళి "ఈ రాత్రికి యిక్కడే అరుగుమీద పడుకుంటాం బాబు" మొహమాటంగా అడిగాడు.

"అలాగే పడుకోండి" నవ్వుతూ అన్నాడు మురళి.

** **

మర్నాడు ప్రొద్దున్న ఎనిమిదింటికి తెరవడానికి వెళ్ళాడు మురళి. ఎదురుగా వీరయ్య, సీతాలు అమ్ముతున్నారు.

వీరయ్య మురళిని చూసి నవ్వాడు. కాని ఆ నవ్వులో చాలా విషాదం తొంగి చూడసాగింది.

కట్టవలసిన బాకీ గురించి బాధపడుతున్నాడేమో అనుకున్నాడు. షాపు తాళం తెరువబోయి ఆగాడు. షాపుకి అడ్డంగా ఆ చిన్న పాప పడుకుని వుంది. గాఢ నిద్రలో వుంది. రాత్రి చాలాసేపు మెలుకువగా వుండి పని చేసినట్టు వుంది. అందుకే యింకా లేవలేదు.

మురళి ఆ పాపను ఎత్తి కొంచెం గోడవారగా పడుకోబెట్టి పాప వంక చూశాడు.

జుట్టుకు నూనె రాసి ఎన్నాళ్ళయిందో అన్నట్టుగా రాగి రంగుకు మారిపోయింది. బాగా పని చేసిందేమో కాళ్ళకి, చేతులకి ముఖం మీద మట్టి అంటుకుని వుంది. వంటికి కూడా అంటుకున్నట్టుగా చిరిగిపోయిన గౌనులో నుంచి కనబడుతోంది.

శరీరం మీద బాగా ఈగలు వాలుతున్నాయి.

మురళి వాటిని దులిపాడు.

వీరయ్య, సీతాలు యివేమీ పట్టించుకునే స్థితిలో

**నూతన యువ్వనం పొందండి!**
**సంతానవంతులుకండి!**
**చర్మవ్యాధులనుండి విముక్తులుకండి!**



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స చేయబడును. పోస్టు ద్వారా కూడా చికిత్స కలదు.

ప్రతి నెల క్యాంపులు:

రాజమండ్రి : 1, 16 తేదీలలో 'అశోకా లాడ్జి,'' కోటగుమ్మం వద్ద
కాకినాడ : 2, 17 తేదీలలో ''వీనస్ A.C. లాడ్జి,'' కల్పనా టాకీస్ ఎదుట
భీమవరం : 3, 18 తేదీలలో ''షణ్ముఖ లాడ్జి''
ఒంగోలు : 19వ తేదీ ''హోటల్ పూర్ణిమ'' A.C., బస్టాండ్ దగ్గర
ఖమ్మం : 25వ తేదీ ''హోటల్ కిన్నెర'' A.C., బస్టాండ్ దగ్గర

*Note:* ప్రతి కేంద్రంలో ఉదయం 10 గం. నుండి రాత్రి 10-00 గం. వరకు. పై తేదీలు మినహా మిగిలిన దినములలో డాక్టరుగారు గుడివాడలోని క్లినిక్‌లో వుంటారు.

**డా. డి. మార్కండేయులు**
ఆయుర్వేదభిషక్,
సెక్స్&స్కిన్ స్పెషలిస్ట్
పార్కు రోడ్, గుడివాడ-521301
* ఫోన్స్: 2522 & 2540

లేరు.

తొమ్మిదయింది.........

పాప యింకా నిద్ర లేవలేదు.

పదయ్యింది......

పాప కనీసం నిద్రలో అటు ఇటు కదలడం లేదు.

మురళికి ఏదో అనుమానం వచ్చి పాప నాడి పట్టుకుని చూశాడు. వెంటనే కరెంట్ షాక్ కొట్టినట్లు వులిక్కిపడ్డాడు.

తనకున్న కొద్దిపాటి వైజ్ఞానిక పరిజ్ఞానంతో తెలుసుకున్నాడు. పాప చనిపోయి చాలాసేపయిందని.

అతనికి వెంటనే ఏమీ అర్థం కాలేదు. రాత్రి చాలాసేపు చలిలో, వర్షంలో పని చేసేసరికి 'న్యూమోనియా' వచ్చి వెంటనే చచ్చిపోయి వుంటుంది.

అతని కళ్ళల్లోనుంచి అప్రయత్నంగా నీళ్ళు కారాయి.

ఇంతలో ఆనందంగా వీరయ్య అతని దగ్గరకు వచ్చాడు.

''బాబుగారు అమ్మింది మొత్తం లెక్క పెట్టాం. మూట ముప్ఫయి రూపాయిలు వచ్చింది. కామరాజుకి నా బాకీ పూర్తిగా తీర్చేయచ్చు బాబుగారు. నా కష్టాలన్నీ గట్టెక్కినట్టే'' అనడంతో అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

సీతాలు పరిస్థితీ అలాగే వుంది.

మురళి తేరుకున్నాడు ''వీరయ్యా పాప... పాప'' అన్నాడు.

''ఏమిటి బాబు?''

''పాప చచ్చిపోయింది వీరయ్య'' తడబడుతూ అన్నాడు.

వీరయ్య మెల్లిగా తలవంచుకుని అన్నాడు ''నాకు పొద్దున్నే తెలుసుబాబు''


గుండెల్లో బుల్లెట్ దిగినట్లయింది మురళికి. వెంటనే అతని ముఖం కోపంతో ఎర్రబడింది. ''యూ బాస్టర్డ్! కన్న కూతరు చనిపోతే అంత ఆనందంగా ఎలా వున్నావురా రాక్షసుడా?'' అతను ఆవేశంతో వూగిపోతున్నాడు.

వీరయ్య వెంటనే ఏం మాట్లాడలేదు. తర్వాత యింకా మెల్లగా అన్నాడు- ''యిది నా కూతురు కాదు బాబు. క్రితం నెలలో జాతరలో దొరికింది.''

వెనుకనుంచి యింకో బుల్లెట్ దిగబడినట్లయింది. వెంటనే తేరుకుని పిచ్చి కోపంతో వీరయ్య దవడ పేలిపోయేటట్లు కొట్టాడు మురళి.

''స్కౌండ్రల్. నువ్వు నిజంగా రాక్షసుడివి. నీ కూతురు కాకపోతే మాత్రం కన్నకూతురి కన్నా ఎక్కువగా సహాయం చేసింది కదరా. నీ బాకీ తీరిందన్న ఆనందంతో పాప శవాన్ని పక్కన పెట్టుకుని ఆనందిస్తున్నావా దుర్మార్గుడా''

వీరయ్య కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. మురళి అంత గట్టిగా అడిగేసరికి ఒక్కసారి బరస్ట్ అయ్యాడు. ''నిజంగా నేను రాక్షసుడినే బాబూ! అందుకే ఎక్కడో దొరికిన యీపిల్లను కన్న కూతురిలా పెంచినా యీపాప




చచ్చిపోతే ఆనందిస్తున్న దుర్మార్గుడిని బాబు. కాని మా పేదోళ్ళ మనసులు ఎందుకు అంత దుర్మార్గంగా తయారవుతాయో తెలుసా బాబు?''

ఆశ్చర్యంగా వీరయ్య కేసి చూడసాగాడు మురళి.

''కామరాజు తండ్రి కంటే దుర్మార్గుడు బాబు. పైగా కామ పిశాచి. బాకీ తీర్చడానికి గడువు పెట్టాడు. కాని నెలలో అంత డబ్బు ఎలా తీర్చాలి? నాతో పాటు నా పెళ్ళాం, నా చెల్లి డబ్బు కోసం కష్టపడసాగాం. ఒక పూట తిండి తిని ఒక పూట తినలేకపోయే వాళ్ళం. అయినా వాడి డబ్బు చెల్లించలేకపోయాము. గడువు పొడిగించమని ప్రార్థించాను. అయినా వినలేదు. అప్పు తీర్చలేదన్న వంకతో నా చెల్లెల్ని పాడుచేశాడు బాబూ! అది జరిగిన తర్వాత ముఖం... చూపించలేక... నా చెల్లెలు... చచ్చిపోయింది... బాబు'' భోరుమని విలపించసాగాడు వీరయ్య.

సీతాలు కూడా ఏడుస్తోంది.

మురళి యింకా అలాగే వుండిపోయాడు.

వీరయ్య తేరుకుని పాప శరీరాన్ని తీసుకున్నాడు. సీతాలు బలవంతంగా నిభాయించుకుని సామాన్లు సర్దసాగింది.

మురళికి రాత్రి చలాకీగా పనిచేస్తూ నవ్వుతూ తిరుగుతున్న పాపే గుర్తుకు రాసాగింది.

అతని కడుపులో ఎవరో చెయ్యిపెట్టి తిప్పినట్లయింది.

వాళ్ళు సర్దుకోవడం పూర్తయింది.

సీతాలు ముందు నడవసాగింది. వీరయ్య కూడా ముందుకు నడవబోయి ఆగి మురళి దగ్గరకు వచ్చాడు...

మురళి అతని వైపు సూటిగా చూడలేకపోతున్నాడు.

వీరయ్య అన్నాడు ''పాప చచ్చిపోయిందని తెలిసినా నేను బాకీ డబ్బులు వచ్చాయని ఎందుకు ఆనందంగా వున్నానో తెలుసా బాబు? రేపు యీడబ్బులు కట్టకపోతే నా పెళ్ళాన్నే... ఆ కామరాజు...'' మాట పూర్తి చెయ్యలేక... నీళ్ళు నిండిన కళ్ళు దించుకుని వెళ్ళిపోయాడు వీరయ్య.

ఎవరు రాక్షసులో అర్థంకాక చూస్తుండిపోయాడు మురళి.

▲